
# అందరూ మనవాళ్ళే!



"మేష్టారూ!" వీధిలోంచి పోస్ట్‌మాన్ కేక.

ఒకప్పుడు పోస్ట్‌మాన్ కేక అన్నా - ఇంటి ముందు కాకి అరుపన్నా నాకెంతో ఇష్టంగా ఉండేది. పదకొండున్నరయే సరికి కళ్లు పోస్ట్‌మాన్ రాకకోసం అత్రంగా ఎదురుచూసేవి. ఏ పత్రిక నుండి కథ సెలెక్టయి వస్తుందోనన్న ఆశ. పత్రికలనుడి ఎం.ఓనో, చెక్కో (రావలసి ఉన్నప్పుడు) వస్తుందన్న ఆశ!

ఆ ఆనందం వర్ణనాతీతం!

ఇక కాకుల అరుపుల సంగతేమంటే కాకు లరిస్తే చుట్టాలొస్తారు. చుట్టాలంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడయితే వచ్చిన చుట్టాలు ఏ పళ్లో స్వీట్లో తెచ్చేవారని...... ఆనందం ఉండేది. ఇప్పుడయితే గంటల తరబడి వాళ్ళతో మాట్లాడుతూ కాలం గడుపుతుంటే ఇష్టమైన పదార్థాలు తిన్నంత తృప్తి!

అలాంటిది కొన్నాళ్లుగా పోస్ట్‌మాన్ వస్తున్నాడంటే భయం! అతడి కేక వింటే గుండెల్లో దడ! ఇక బంధువులు కానీ.... మిత్రులు కానీ..... వస్తున్నా రంటే నేరం చేసిన వాణ్ణి వెతుక్కుంటూ పోలీసు లొచ్చినంత భయం!

"రండి సార్! మీకు రిజిష్టర్డ్ పోస్టు వచ్చింది" అన్నాడు పోస్ట్‌మాన్. అతని ముఖకవళికల్ని బట్టి..... నాకొచ్చిందేదో 'శ్రీముఖం' అని అర్థమైపోయింది.

సంతకం చేయించుకుని, 'ఆరెల్' ఇచ్చి "మాష్టారూ! మీకు చెప్పేటంతటి వాణ్ణి కాననుకోండి. మీకూ ఆడపిల్లలున్నారు. కొంచెం జాగర్తపడండి సార్" అంటూ వెళ్ళిపోయాడు.

అతడలా వెళ్ళగానే కవరు చించాను.

విశాల చిట్‌ఫండ్ కంపెనీ నుండి నోటీస్ చదివాను.

ఒళ్ళంతా తడిసింది చెమటతో. తల్లోంచి వేడిగాడ్పులు. నరాల్లో నిస్సత్తువ!

ఏం చేయాలో తోచలేదు.

ఆలోచిస్తుంటే నేనేమయిపోతానో అన్న భయం! నన్ను నమ్ముకున్న అర్థాంగి.... కన్న సంతానం ఏ గంగలో దూకాల్సి వస్తుందోనని ఆందోళనా ఒకదాని తరువాత ఒకటి....!

నేనెలాంటి చిక్కుల్లో పడ్డానో చూడండి!

బాబయ్య..... అంటే మా అమ్మకు స్వయానా మరిది నా ఇంటికొచ్చా డారోజు. బాబయ్య వచ్చాడని గొప్ప సంబరపడిపోయాను. "ఏమోయ్ ఎవరొచ్చారో

చూడు!" అన్నాను.

శ్రీమతి ఇంట్లోంచి వస్తూ..... చేతులు పైటతో వత్తుకుంటూ "బావున్నారా? మామయ్యగారూ అత్తగార్ని తీసుకురాకపోయారా?" అంది.

"లేదమ్మా... కుదర్లేదు..... ఏంటో! ఆ కొసనుంచి రావటమంటే మాటలా? తొంబయి మైళ్ళ బస్సు ప్రయాణం. అబ్బా! రామూ! నడుం పట్టేసిందిరా. ఇక మీరే వస్తూ ఉండాలి. మరి నేను రావడమంటే కష్టమే!" అన్నాడు.

"శోభనా! బాబయ్యకి మాంచి ఫిల్టర్‌కాఫీ చేసి పట్రా... బాబయ్యా కాఫీనా? టీనా?

"ఏదన్నా ఫరవాలేదురా!" అనేసి... 'ముందు పెరట్లో కెళ్ళాలి!" అని పెరట్లోకి వెళ్లి ముఖం కడుక్కొనొచ్చాడు. ఈలోగా శోభన కాఫీ కలిపి తెచ్చింది. "శోభనా! రాత్రికి టిఫినేంటి?" అన్నాను.

"చెప్పండి. ఏం చెయ్యమంటారు?"

"పూరీ అంటే బాబయ్యకిష్టం..... పూరీ కూరచేసి, జీడిపప్పు వేసి సేమ్యా చెయ్యి!" అన్నాను. శోభన తన పనుల్లో లీనమైంది.

బాబయ్య నేనూ కబుర్లలో పడ్డాం.

బాబయ్యకి సాహిత్యమంటే చాలా ఇష్టం. నా కథలు గురించి అడిగాడు. "ఒరేయ్! నువ్వోసారి రాసావ్. 'ప్రేమసూత్రం' నవల. దాని గురించి నీకు చెప్పలేదు కదూ? నేను వైజాగ్ వెళ్తున్నాను. నా పక్కసీట్లో ఆయన చేతిలో నీ నవల పడిన మంత్లీ ఉంది. నేను నీగురించి చెప్పడమా? మానటమా?అనుకుంటూ...... ఓసారి పుస్తకం ఇస్తారా? అడిగాను. సారీ! ఏమనుకోకండి. నవల చదువుతున్నాను. చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. ముగింపులో ఉంది. చదివేసి ఇస్తాను అన్నాడు. ఒరేయ్.... రామూ! ఇక నేనాపుకోలేకపోయారా నా సంతోషాన్ని వెంటనే చెప్పేసాను. ఆ నవల రాసిన రచయిత సాక్షాత్తూ నాకు కొడుకు ఒరేయ్... నేను చెప్పినది నాకు నిజం... నీకు అబద్ధం లాగుండొచ్చురా.. కానీ అతను నేనే రచయిత నన్నంత ఆనందపడిపోయాడనుకో!" అన్నాడు.

ఏ రచయితకైనా ఇంతకంటే ఆనందాన్నిచ్చే దింకేముంటుంది?

ఆ తరువాత కాళిదాసు గురించి, వాల్మీకి రామాయణం గురించి తిక్కన గురించి ఆధునిక సాహిత్యం గురించి బాబయ్య అడుగుతుంటే చెప్పి ఎంతో పరవశించిపోయాను.

రాత్రి టిఫిన్లయ్యాక "ఒరే రామూ! నీతో కొంచెం మాట్లడాలి. అలా డాబామీద కెళ్దాం పదరా!" అన్నాడు.

సరేనని ఇద్దరం మేడమీదకెళ్ళాం. "నేను పెద్దవాణ్ణి. నిన్నడక్కూడదు. అడుగుతున్నాను. నీ దగ్గరుండదని తెల్సు. ఎందుకంటే మీ నాన్న గడించిన 'ముల్లె' నీదగ్గరేంలేదు. పైగా అన్నదమ్ముల బరువు బాధ్యతలూ, అక్కచెల్లెళ్ల పెళ్ళిల్లు చేసి.... ఇప్పుడిప్పుడే తేరుకుంటాన్నావ్. నీమీదేం బరువు మోపను. ఎక్కడ పుట్టిస్తానో, ఏం చేస్తావో మరి నాకర్జంటుగా పాతిక వేలు కావాలి. నీకు వడ్డీ నెలనెలా పదో తారీఖులోపు పంపిస్తాను. మీ ఆవిడకు చెప్పకు. అది పై పిల్ల కదా! అపార్థం చేసుకోవచ్చు!" అన్నాడు.

నాకు గుండెలో పిడుగు పడినట్లయింది "నువ్వు వట్టి చేతుల్తో పంపవనే వచ్చాను. 'పెళ్ళి చేసి చూడు', 'ఇల్లు కట్టిచూడు' అన్నారా ఇల్లు చివరి దశలో ఉంది. రేపుంటాను. పరవాలేదు" అన్నాడు.

నాకు కరచరణా లాడలేదు. ఆలోచనలో పడ్డాను. ఇంతలో శోభన వచ్చేసింది. "ఏం చేస్తున్నారు?" అనుకుంటూ.

కాసేపు కబుర్లు చెప్పుకుని దిగిపోయాను.

ఎక్కడా కుదర్లేదనటానికి మనసొప్ప లేదు. తెలిసిన ఒకాయన్ని అడిగితే 'ధర్మవడ్డీ'కి ఇస్తానన్నాడు. కాని నోటు రాయాలన్నాడు. నోటు రాసి పాతికవేలు తీసుకుని ఆయన చేతిలో పెట్టాను. ఆయన నన్ను తెగ పొగిడి వెళ్ళాడు. మీ బాబయ్యెందుకొచ్చారని శ్రీమతి అడిగినా జవాబు చెప్పక దాటించేసాను. ఆ తరువాత మూడు నెలలు అన్నట్లుగానే వడ్డీ పంపేసాడు. తరువాత పాతికవేలు మీద

వడ్డీముప్పయివేలు అయింది. ఎన్నిసార్లు ఉత్తరం రాసినా, ఏదో కారణం చెప్పి వీలయినంత త్వరలో పంపేస్తాననేవాడు. చివరకు నోటు కోర్టుకెళ్లింది. ఎట్టికేలకు బాబాయ్య ముప్పయివేలు తెచ్చి నాకిచ్చి "ఒరే నీకిబ్బంది పెట్టేసాన్రా! చిన్నవాడివయినా మన్నించమంటున్నాను. అసలు పూర్తిగా ఇచ్చేద్దామనే అనుకున్నాను. నీటికిబ్బందిగా ఉందని బోరువేయించాను. వాటర్ టాంకు కట్టించాను. పాలకి కోడలు చికాకు పడుతోందని ఇరవైవేలిచ్చి జెర్సీని కొన్నాను. ఆ మధ్యనే పైగదులు మొజాయిక్ చేయించాను. లేకపోతే నీకు పూర్తిగా తెగ్గొట్టెద్దును." అని ముప్ఫయివేలు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

అంతే!

మరి జాడలేదు. ఎప్పుడెళ్ళడిగినా "ఇచ్చేస్తారా. నీ రుణం ఉంచుకోను. నీ మేలుమరచిపోతాన్రా?" అనేవాడు. అడిగి అడిగి విసిగెత్తి మానేసాను.

ఆ పుండింకా మాననేలేదు.

మా శ్రీమతి అన్నయ్య కొడుకు ఊడిపడ్డాడు. రెండు రోజులు సరదాగా కబుర్లు చెప్పాడు. వాడు టెన్త్ వరకూ చదివి ఆపేశాడు. "మావయ్యా! మీ దగ్గరకి అర్జంటుగా పనిమీదొచ్చాను. మీకు తెలుసు గదా, నేను కేటరింగ్ చేస్తున్నాను. ఈ మధ్య ఒక పార్టీకి మూడొందల మందికి ఒప్పుకున్నాను. ఒప్పుకున్ననాడు రేట్లు తక్కువున్నాయి. పెళ్లి మార్చిలో జరిగింది. ఒప్పుకున్నది ఆరుమాసాల క్రిందట, వాళ్ళనుకున్నట్లు చెయ్యటం వల్లనాకు చాలా లాస్ వచ్చింది. మూడు పార్టీలు బుక్కయ్యాయి. మూడు అలానే దెబ్బతీసేసాయి. నేనడిగితే మేం అంతే ఇస్తామని ఒప్పుకున్నాం. అంతకంటే ఇవ్వలేమనేసారు. అప్పుచేసి పెట్టాను. ఇలాంటివి అప్పుడప్పుడూ మాకు మామూలే. కానీ ఈసారంత దెబ్బఎప్పుడూతగల్లేదు. నాకర్జంటుగా సొమ్ము కావాలి. అక్టోబరులో నాకు డబ్బులొస్తాయి. మీకిచ్చేస్తాను. ఇంటికెళ్తే రోజువారీ వడ్డీవాళ్ళు బతకనివ్వటంలేదు" అన్నాడు.

నేనెంత లేదని చెప్పినా కాళ్లు పట్టుకొని వదలలేదు.

"నేనొట్టి చేతుల్తో వెళ్తే నన్ను వాళ్లు బతకనివ్వరు. మీరు కాదంటే... నేనే రైలు క్రిందో బుర్ర పెట్టాల్సి వస్తుంది!" అని ఏడుస్తూ కూర్చున్నాను.

నా బుర్ర పూర్తిగా పాడయిపోయింది. వాడే రైలు కిందనో నిజంగా తలపెట్టి చస్తే... ఆ బాధ నన్ను జీవితాంతం పట్టి పీడిస్తుంది. అందుకే వాడన్నంత కాకపోయినా కొంత ఇచ్చాను. నెలనెలా వడ్డీ మాత్రం పంపమన్నాను. గంగిరెద్దులా తలూపి "మావయ్యా! దేవుడులా రక్షించారు. మీ మేలు మరిచిపోలేను. మీరు చెప్పినట్టే చేస్తా"నని వెళ్ళిపోయాడు.

వెళ్ళిన తరువాత నా అడ్రస్సే మర్చిపోయాడు.

ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబివ్వడు. ఫోన్‌కి దొరకడు. ఇంక ఇంటికొచ్చిన అత్తగారూ, బావలూ మేనకోడళ్ళూ ఏవో అవసరాలకని, అడిగినవీ... చేబదుళ్ళుగా పట్టుకెళ్ళినవీ... వాటికి లెక్కలేదు. తిరిగి రానివి కదా!

అందుకే ఒకప్పుడు కాకులరిస్తే చుట్టాలొస్తారని పడే ఆనందం స్థానంలో కాకులరిస్తే చుట్టాలెక్క డొచ్చేస్తారోనని భయం ఆవరించింది.

మరపురాని మరో సంఘటన ఏమంటే

వరంధామయ్య నాకు బాగా స్నేహితుడు. ఇంచుమించుగా ఇరవై సంవత్సరాల పరిచయం. ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. అతను చేసేది చిన్న ఉద్యోగమే. ఆ చిన్న జీతంలోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. కొడుకులు ఎక్కడోదూరంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వాళ్ళేమీ పంపరు. పంపగలరో, పంపలేరో తెలీదు. ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసేసాడు. మూడో కూతురికి సంబంధం ఖాయపరిచాడు. లక్షరూపాయల కట్నం. అల్లుడు స్కూలు

టీచరు. కష్టపడి వెనకవేసిన డబ్బుపూర్తిగా చాలని పరిస్థితి. కొడుకులకు తెలియజేస్తే 'వస్తాంకదా'! అన్నారు.

పరంధామయ్య కొడుకుల మీద కొండంత ఆశ పెట్టుకున్నాడు. పెళ్ళి పనులు ప్రారభించాడు. పెళ్ళికి ఆడపెళ్ళివారు వందమంది వస్తామన్నారు. రెండు పూటల భోజనాలు, మూడు పూటలూ టిఫిన్లూ ఉండాలన్నారు. భోజనాలు మాత్రం బాగుండాలని... ఏపూట ఏ టిఫిన్ కావాలో, ఏకూరతో ఏ రోజు భోజనం ఉండాలో, పులావ్ ఎప్పుడు చెయ్యాలో, ఏఏ స్వీట్లు కావాలో ఆడపడచులు ముందుగా హుకంజారీ చేశారు. ఏం తేడా వచ్చినా బాగుండదన్నారు.

పరంధామయ్య అక్కుర్లు, బుక్కర్లు కక్కుకుంటూ వచ్చేసాడు. విషయమంతా చెప్పాడు. "డబ్బు చాలదు. ఏం చెయ్యాలో తోచటం లేదు" అన్నాడు.

అంతా విన్నాను "ఏం చెయ్యాలో చెప్పండి!" అన్నాను.

"రామూ! నాకు నువ్వు తోడబుట్టని తమ్ముడివి. నీ దగ్గర దాపరికం ఎందుకూ? నాకు నీ ఖాతాలో బట్టలిప్పించు. నీ కొట్టులో కిరాణా ఇప్పించు. నీ డబ్బులు పైసా ఉంచుకోను. ఇవి చేతులు కావు" అని కాళ్ళు పట్టుకున్నంత పనిచేశాడు.

"నర్లేండి. దానికంత పెద్దమాట లెందుకు?" అని అతను చెప్పినట్టే నా ఖాతాలో బట్టలూ, నా కొట్లో కిరాణా సరుకులు ఇప్పించాను.

పెళ్ళయిపోయింది. కొడుకులు కొంత డబ్బిచ్చి చెయ్యి దులుపుకున్నారు.

పెళ్ళిపందిట్లో అందరిముందు, "ఇదిగో ఇతను నా రాముడు. ఇతను నా పాలిట దేముడు. నా పరువు కాపాడాడు. రామూ! నువ్వు చేసిన మేలు జన్మలో మరువలేను" అన్నాడు. పదిమంది ముందూ అవకాశం దొరికినప్పుడల్లా పొగుడుతూనే ఉండేవాడు.

పెళ్ళయిపోయింది. పిల్ల అత్తవారింటికెళ్ళింది. నెల తప్పింది. పురిటికొచ్చింది. మధ్యలో కొంత తీర్చాడు! "రామూ! ఆలస్యమైపోయింది. నీ రుణముంచుకోను. నీమేలు మరిచిపోలేను" అనేవాడు.

నేనేనాడూ ఫస్టు రాగానే జమ చేసేవాణ్ణి కావటంచేత ఆరుమాసాలు వాళ్ళేమీ అనలేకపోయారు. రానురాను వాళ్ళు కబుర్లు చెయ్యటం మొదలెట్టారు. నేను నచ్చ చెప్పేవాణ్ణి. డబ్బు సంగతి వచ్చినప్పుడల్లా పరంధామయ్య "ఆ విషయం చెప్పాలనే వచ్చాను. నీ బాకీ తీర్చేద్దామనుకొన్నంతలో అమ్మాయి పురిటి కొచ్చింది. ఇప్పుడు పురిటి ఖర్చులు, బాబ్బాబు ఆలస్యమైపోయింది. మరి కొద్దికాలం ఓపికపట్టు" అనేవాడు.

తరువాత అడగ్గా మరికొంత తీర్చాడు చిరాకు పడుతూ, ఇంకా బాకీ ఉంది. శోభనకు తెలిస్తే చివాట్లేస్తుంది.

"ఏం చేయాలి? అనుకున్నంతలో 'ఎల్ఐసి' మనీబేక్ పాలసీ అందింది. అదలా బట్టల షాపుకీ కిరాణాషాపుకీ ఇచ్చేసాను. పరంధామయ్య ఆ తరువాత కనిపించినప్పుడు చిరునవ్వు నవ్వేవాడు. ఆశ్చర్య మేమంటే ఓ రెండు సంవత్సరాల తరువాత ఇరవై వేలు ఖర్చుపెట్టి షష్టిపూర్తి చేసుకున్నాడు. నాకు పిచ్చి కోపం వచ్చింది. తాడోపేడో తేల్చేద్దామని వెళ్ళాను. "రామూ! వచ్చావా? నీకింకా బాకీ తీర్చనేలేకపోయాను. నాకిప్పుడెందుకర్రా షష్టిపూర్తి, ఆ డబ్బులా రామూనికిచ్చి అతని రుణం తీర్చుకోండర్రా! అంటే వినక పిల్లలీ తంతుపెట్టారు. ఈ సంవత్సరం నీ రుణం ఉంచుకోను. క్షమించు నాయనా!" అని చేతులు పట్టుకున్నాడు.

ఆరు మాసాల్లో మకాం కొడుకు దగ్గరికి మార్చేసాడు మాట మాత్రంగానైనా చెప్పకుండా!

ఇక ఇప్పుడొచ్చిన రిజిష్టరు పోస్టు విషయానికొస్తే- గిరిధర్ ఒకప్పటి నా క్లాస్‌మేట్. గిరిజన కార్పొరేషన్‌లో ఉద్యోగి. విశాల చిట్‌ఫండ్స్‌లో లక్షరూపాయల చిట్‌పాడాడు. రెండే ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టాడు. ష్యూరిటీ కావాలని వచ్చాడు. చిన్నప్పటినుంచీ

తెలిసినవాడు కదాని మరోమాట ఆడక్కుండా సంతకం పెట్టేశాను.

"బ్రదర్! మరో చిన్న హెల్ప్ చెయ్యాలి!" అన్నాడు.

"చెప్పు"

"మా ఆఫీసులో అందరూ చాలామందికి ష్యూరిటీస్ ఇచ్చి ఉన్నారు. ఇంకా మూడు ష్యూరిటీస్ ఉండాలి. మీ ఫ్రెండ్సు...." అని నసిగాడు.

అ మాత్రం సహాయం చెయ్యడంలో తప్పులేదనిపించి "మా కొలీగ్స్‌ని రిక్వెస్ట్ చేస్తే ముగ్గురిలో ఇద్దరూ నామీద నమ్మకంతో రెండోమాటకి ఆస్కారం లేకుండా సంతకాలు చేసేసారు. మూడో వ్యక్తి మాత్రం "చూడు రాం! అతనెవరో నాకు తెలీదు. నీమీద నమ్మకంతో సంతకం చేస్తున్నాను. రేపేదయినా అయితే బాధ్యుడివి. నువ్వే" అని సంతకం చేశాడు.

అప్పుడు నాకతనిమీద కోపం వచ్చింది. కానీ తరువాత తెలిసింది. గిరిధర్ త్రాగుడికి బానిసై పోయాడు. పేకాటకి దాసుడయి పోయాడని. మధ్యలో చాలాకాలం మా మధ్య కాంటాక్ట్ లేకపోవటం నాకతని విషయాలేవీ తెలీలేదు. మూడుమాసాల తరువాత మోతాదుకు మించి తాగేసి, గుండె అగి గిరిధర్ చనిపోయాడు. రెండుమాసాల తరువాత విశాల చిట్‌ఫండ్స్ నుండి నోటీసులు. కొలిగ్స్ అంతా గోల చేశారు. నేను వాళ్ళకు భరోసా ఇచ్చాను.

కానీ మొదటి స్యూరిటీ నాది కాబట్టి చిట్‌ఫండ్ కంపెనీవాళ్ళు నాకిప్పుడు సాలరీ ఎటాచ్‌మెంట్ పెట్టమని పంపారు.

నోటీసందుకున్న వెంటనే గిరిధర్ ఇంటికెళ్ళి వాళ్ళావిణ్ణి కలిసి, విషయం చెప్పాను, ఆవిడ నిర్దాక్షిణ్యంగా చెప్పిన మాటలు నాక్కోపం తెప్పించాయి. ఆమె ఒక్కటే అంది "ఆయనకి ఊరు మొత్తం మీద తేలిన అప్పు ఆరేడు లక్షలు దాటింది. నేనెవరికి తీర్చగలను? ఐనా సంతకం చేసేముందు నన్నడిగారా? నాకు రావలసిన డబ్బులొస్తే మీరతనికి స్నేహితులు కాబట్టి.... పూర్తిగా కాకపోయినా కొంత ఇవ్వగలను నన్ను అర్థం చేసుకొని మన్నించండి. మీకూ నష్టమే. కాదన్లేను. నాకూ ఇద్దరూ పిల్లలున్నారు. ఆఫీసువాళ్ళు నాకు ఉద్యోగం ఎప్పుడిస్తారో... అనలిస్తారో, ఇవ్వరో తెలీదు. నన్ను రచ్చకీడ్చకండీ. మీ మేలు మరచిపోలేను" అంది.

ఆమె మాటల్లోనూ అర్థం లేకపోలేదు. మొదట్లోకోపం వచ్చినా, అనాథ, అబల కన్నీరు పెట్టేసరికి మనసు కరిగిపోయింది. మరో మాటాడలేక వచ్చేసాను.

నేనింటికొచ్చేసరికి శోభన సీరియస్‌గా ఉంది. ఎంతో సేపటిగ్గానీ మాటాడలేదు. పడుకునే ముందు "వెళ్ళిన పనేమయింది?" అని ప్రశ్నించింది

గతుక్కుమన్నాను.

"ఏపని?"

"మీరేపని మీదనెళ్ళారో ఆపని."

"అయింది."

శోభన తొమ్మిదంకెవేసి గోడకేసి తిరిగి దుప్పటి ముసేగేసుకుంది.

ఆ మర్నాడు ఆఫీసునుండి వచ్చేసరికి ఇంటి ముదు జనం!

'ఏమయిందా?' అని గాబరాగా వాళ్ళను నెట్టుకు లోనికెళ్ళేసరికి, అందరూ కిసుక్కున నవ్వి తప్పుకున్నారు.

అప్పుడు నాకు కనిపించినది పెద్ద బేనరు.

"ఎలాటి వారికైనా వలయుచో చిట్‌ఫండ్స్‌కు ష్యూరిటీలు ఇవ్వబడును. అప్పులు కావలసినచో వడ్డీలకు తెచ్చిసొమ్ము ఇవ్వబడును. వడ్డీలు మీరు చెల్లించనవలసరం లేదు. ఈ (కర్ణుని) దానఘంట కొట్టన మీ ఇంటికి మేమే రాగలము."

"-రామం" అని!

గుటకలు మింగుతూ లోనికినడిచాను.

అంతకంటే చేయగలిగినదేముంది?